క్లుప్తంగా

గంధం చెట్టు నరికివేతకు యత్నం..



ఆలయ ప్రాంగణంలో కింద పడిన చందనం చెట్టు కొమ్మలు

భామిని: మండలంలోని బత్తిలి సంతోషిమాత ఆలయ ప్రాంగణంలో గల తెల్లగంధం చెట్టును నరికివేసేందుకు కొంతమంది ప్రయత్నించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల కిందట చెట్టును నరికేందుకు ప్రయత్నిస్తుండగా..కొమ్మలు భక్తుల విశ్రాంత షెడ్డుపై పడడంతో శబ్దం రావడంతో స్థానికులు లేవడంతో దొంగలు పారిపోయినట్లు సమాచారం. ఇప్పటికీ చెట్ల కొమ్మలు అక్కడే పడి ఉన్నాయి. అయినప్పటికీ ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు బుధవారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఆప్తాలమిస్ట్ టి. కృష్ణారావు విద్యార్థులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ పాల్గొన్నారు.

‘ఫిర్యాదులపై స్పందిస్తాం’

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలో ప్రజలు తెలియజేసే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరిస్తామని కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక నీలమ్మ కాలనీ, వడమ, యాలాం సచివాలయ పరిధి ఎన్కే.రాజపురం కొత్త కాలనీల్లో పర్యటించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకన్నారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

సరిహద్దు సమస్య కలెక్టర్‌కు నివేదిస్తా..

- సబ్ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డి



మ్యాప్‌లు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డి తదితరులు

భామిని: వంశధార నదీ తీరంలో ఒడిశా అనుమతులతో గతంలో నిర్వహించిన ఇసుక ర్యాంప్ సరిహద్దు సమస్యలను కలెక్టర్‌కు నివేదిస్తానని పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని దిమ్మిడిజోల వద్ద వంశధార నదీతీరంలో గల ఇసుక ర్యాంప్‌ను ఒడిశా అధికారులతో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 1972, 1984 భూ సెటిల్‌మెంట్ రికార్డులను పరిశీలించారు. ర్యాంప్‌పై ఒడిశా, ఆంధ్రాలకు చెరిసగం హక్కు ఉంటుందని ఒడిశా అధికారులు వాదించారు. అయితే ర్యాంప్ నడిపిన స్థలం ఒడిశాలో ఉండగా.. ఇసుక డంప్ చేసిన స్థలం ఆంధ్రా భూభాగమని రైతులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జిల్లా మైన్స్ ఎ.డి శ్రీనివాసరావు, సర్వేయర్ కుమార్‌స్వామి, తహసీల్దార్ నిమ్మల శేఖరం, తదితరులు పాల్గొన్నారు.

పార్కును పరిశీలించిన పీఓ

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు కుడిమట్టికట్ట వద్దనున్న ఐటీడీఏ పార్కును పీఓ అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం పరిశీలించారు. చిన్నారుల ఆట సామగ్రితో పాటు పార్కులో నిర్మించి ఖాళీగా ఉన్న భవనాల్లో ట్రైబల్ మ్యూజియం, అటవీ ఉత్పత్తుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. తోటపల్లి జలాశయంలో బోట్‌షికారును కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పార్కును ఆహ్లాదంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని చెప్పారు. ఆయన వెంట సహాయ ఇంజినీర్ తిరుపతిరావు ఉన్నారు.

వన్‌స్టాప్ కేంద్రాలలో స్థానికులనే నియమించాలి

పార్వతీపురం టౌన్: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాస్పత్రి కేంద్రంగా నిర్వహించబోయే వన్‌స్టాప్ సెంటర్‌లలో నియామకాలను పార్వతీపురం జిల్లా అభ్యర్థులకే పరిమితం చేయాలని నిరుద్యోగ మహిళలు కోరారు. ఈ మేరకు బుధవారం ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా జిల్లా ఏర్పడిన తర్వాత మంజూరైన ఈ ప్రాజెక్టులో స్థానిక అభ్యర్థులకు అవకాశం కల్పిస్తే జిల్లాకు న్యాయం చేసినట్లు ఉంటుందని అభిప్రాయపడ్డారు.

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం..

- ముస్తాబైన పాలకొండ దుర్గమ్మ ఆలయం
- అక్టోబర్ 3 నుంచి దసరా ఉత్సవాలు
- అధికారులతో సమావేశమైన సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు





శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న కోటదుర్గమ్మ దేవస్థానం (ఇన్‌సెట్లో) కోటదుర్గమ్మ)

పాలకొండ రూరల్:

కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం..ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా పూజలకు సిద్ధమైంది. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సుదీర్ఘ రాజరికపు చరిత్ర గల ఈ ఆలయం 2001లో దేవదయశాఖ పరిధిలోకి వచ్చింది. తొలుత తక్కువ ఆదాయం వచ్చే ఈ ఆలయం ప్రస్తుతం ఎంతో వృద్ధి చెందింది. జిల్లాలో ఉన్న ప్రముఖ ఆదాయ వనరులున్న దేవస్థానాల్లో కోటదుర్గమ్మ దేవస్థానం ఒకటి. ఏటా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శరన్నవరాత్రి వేడుకలకు స్థానికులతో పాటు దేశ, విదేశాలల్లో ఉన్న భక్తులు కూడా వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ క్రమంలో ఏర్పాట్ల విషయంలో సంబంధిత యంత్రాంగం మరింత అంకితభావంతో దృష్టి సారించాల్సి ఉందని భక్తులు సూచిస్తున్నారు. ప్రతిఏటా అమ్మ దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న క్రమంలో అందుకు తగ్గ సౌకర్యాలు కల్పించాలని అభిప్రాయపడుతున్నారు.

నిజరూప దర్శనం ..

ఏడాదిలో కొద్ది గంటల సమయం మాత్రమే అమ్మవారు నిజరూపంలో దర్శనమిస్తారు. దసరా వేడుకల్లో భాగంగా మూహూర్తపు రాట వేసే రోజున అమ్మవారి నిజరూప దర్శనం భక్తులకు కల్పిస్తారు. నిజరూప దర్శనం కోసం ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు వేకువజామునే ఆలయానికి చేరుకుంటారు. అయితే ఈ సమయంలో దర్శనానికి వచ్చే భక్తులకు ప్రతి ఏడాదీ తప్పడం లేదన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తాత్కాలిక వసతి కల్పించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఘనంగా నిర్వహిస్తాం..



శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించే క్రమంలో సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి అధికారులను ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తున్నారు. ఈ క్రమంలో గత అనుభవాలను పరిగణలోకి తీసుకుని ఈ ఏడాది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం. తొమ్మిది రోజులు భక్తులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా దర్శనాలు కల్పిస్తాం. సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది.– వీవీ సూర్యనారాయణ, కార్యనిర్వాహణాధికారి, కోటదుర్గమ్మ దేవస్థానం

అలాగే చిన్న పిల్లలతో క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు పాలు అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో అధికారులు శ్రద్ధ చూపాలని భక్తులు కోరుతున్నారు. అమ్మవారికి సమర్పించే ఘటాలను భక్తులకు ఆలయ పరిసరాల్లో పడేస్తున్నారు.. అలాగే తలనీలాలు సమర్పించే భక్తులకు స్నానఘట్టాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. దర్శన సమయాన్ని కూడా గతంలో మాదిరిగా రాత్రి 11 గంటల వరకు పెంచాలని భక్తులు కోరుతున్నారు. వీటన్నింటిపై దేవదాయశాఖ, ఇతర అధికారులు సమన్వయంతో నిర్ణయం తీసుకోవాలి. ఇదిలా ఉంటే భక్తులు సమర్పించిన కానుకలతోనే తాత్కాలిక ఉత్సవ కమిటీ ఉత్సవాలు నిర్వహిస్తోంది. ఈ సమయంలో కమిటీ సభ్యులు తమకు నచ్చినట్లు వ్యవహరిస్తున్నారే ఆరోపణలున్న నేపథ్యంలో పాలకవర్గం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్న వాదన వ్యక్తమవుతోంది.

ఆదాయ వివరాలు ఇలా..

జిల్లాలో అధిక ఆదాయం వచ్చే ఆలయాలతో పోల్చుకుంటే పాలకొండ కోటదుర్గమ్మ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో కూడా ప్రత్యేకతను చాటుకుంది. దేవదాయశాఖ అందించిన లెక్కల ప్రకారం ఏటా అమ్మ ఆదాయం పెరుగుతునే ఉంది. 2019–20లో రూ.67.25 లక్షలు, 20–21లో రూ.46.76, 21–22లో రూ.56.48, 22–23లో రూ.85.35, 23–24లో 90.54 లక్షల ఆదాయం సమకూరింది. దీంతోపాటు ఫిక్సిడ్ డిపాజిట్లు రూ.1.30 కోట్లు, 938 గ్రాముల బంగారం, బాండ్ల రూపంలో 1.620 గ్రాముల బంగారం, వెండి 49.203 కిలోలుగా ఉంది. ఏటా శరన్నవరాత్రుల సమయంలో భక్తుల నుంచి లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుంది. ఈ నేపథ్యంలో ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం



ఎల్విన్‌పేటలో శుభ్రం చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం ప్రాప్తిస్తుందని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఎల్విన్‌పేట పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పరిసరాల్లో అపరిశుభ్రం నెలకొనడం వలనే మలేరియా, టైఫాయిడ్, డెంగీ మొదలగు వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఆ వ్యాధుల నివారణకు ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



రవిప్రసాదరావును సన్మానిస్తున్న చిత్రం

జియ్యమ్మవలస: మండలంలోని వనజ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్లు రవిప్రసాదరావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్, పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రముఖ పాత్ర పోషించారని అటువంటి వారికి అవార్డు రావడం ఆనందంగా ఉందని జయరాజ్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

‘చెకుముకి’ పరీక్షకు స్పందన



ఎస్.గోపాలపురం మౌంట్‌ఫోర్ట్ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వీరఘట్టం: పాఠశాల స్థాయిలో బుధవారం నిర్వహించిన చెకుముకి పరీక్షకు విశేష స్పందన వచ్చిందని జనవిజ్ఞాన వేదిక సభ్యులు బీఎం గౌరీశ్వరరావు, సూరు సతీష్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన ఈ పరీక్షకు 930 మంది హాజరైనట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అక్టోబర్ 1న మండల స్థాయిలో పరీక్ష ఉంటుందన్నారు.

సాగులో లాభాలు సాధించాలి



గుజ్జువాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): సాగులో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించడం ద్వారా మంచి లాభాలు సాధించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. కురుపాం మండలం గుజ్జువాయి, మరిపల్లి గ్రామాల్లో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల్లో అధిక దిగుబడి సాధించేందుకు రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఇందులో పాల్గొనే వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చే యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె వరి, జీడిమామిడి, పత్తి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.శ్రీనివాసరాజు, డాక్టర్ ఎం.అనంత విహారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్ దయాళ్ జయంతి



దీన్ దయాళ్ చిత్రపటం వద్ద నివాళులు

గరుగుబిల్లి: జన సంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో పండిట్ దీన్ దయాళ్ చిత్రపటానికి బీజేపీ నాయకులు టి.రాము, పి.అశోక్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికేంద్రీకృత రాజకీయ వ్యవస్థ స్వావలంబన గల ఆర్థిక వ్యవస్థలు గ్రామాభివృద్ధికి ప్రధాన ఆధారమని పండిట్ దీన్ దయాళ్ భావించేవారన్నారు. కార్యక్రమంలో ఆర్.వినోద్‌కుమార్, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం

పాలకొండ రూరల్: ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ మాధవరావు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో అర్బన్ పరిధిలోని లబ్ధిదారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ‘మన ఇళ్లు – మన గౌరవం’ పేరిట ఈనెల 28న అవగాహన కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.

బకాయి వేతనాలు చెల్లించండి

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలం గుమ్మ పంచాయతీ పరిధిలో పని చేసిన వలంటీర్లకు ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన గౌరవ వేతనాలు వెంటనే ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అసలే ఉపాధి కోల్పోయిన వలంటీర్లు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు స్పందించి గౌరవ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరారు.

‘పెసా’ సెమినార్‌కు ప్రజాప్రతినిధులు

సీతంపేట: ఢిల్లీలోని నేషనల్ అంబేడ్కర్ భవన్‌లో గురువారం జరగనున్న పెసా (పంచాయతీస్ ఎక్స్‌టెన్షన్ టూ షెడ్యూల్డ్ ఏరియా) చట్టంపై సెమినార్‌కు సీతంపేట నుంచి ముగ్గురు ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారు. ఎంపీపీ బి.ఆదినారాయణ, పెద్దూరు సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి, కొత్తగూడ సర్పంచ్ ఎస్.సుశీల ఇప్పటికే ఢిల్లీ వెళ్లినట్లు మండల అధికారులు తెలిపారు.

గిరిజనులకు వైద్య సేవలందివ్వండి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): జ్వరాలతో బాధపడుతున్న గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందివ్వాలని కురుపాం వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. కురుపాం మండలంలోని నీలకంఠాపురం, జరడ, ఊసకొండ తదితర పంచాయతీలకు చెందిన గ్రామాల్లో పలువురు గిరిజనులు జ్వరాలతో మంచం పట్టారని, ఆస్పత్రుల వద్దకు వెళ్తే వైద్యులు చేపడుతున్న సమ్మె కారణంగా అందుబాటులో ఉండడం లేదని, ఈ కారణంగా గిరిజనులకు సక్రమంగా వైద్య సేవలందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల సమ్మెను విరమింపజేసి, ఆస్పత్రుల వద్ద మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని, అలాగే గ్రామాల్లో వైద్య శిబిరాలు ముమ్మరంగా నిర్వహించాలని అన్నాజీరావు కోరారు.

ఇన్‌చార్జి ఏడీగా దీనకుమార్



దీనకుమార్

గరుగుబిల్లి: గరుగుబిల్లి ఏరియా పశువైద్య ఇన్‌చార్జ్ సహాయ సంచాలకులుగా సీతానగరం ఏరియా పశువైద్యశాలలో పని చేస్తున్న డా.సిహెచ్.దీనకుమార్‌ను నియమించారు. ఇంతవరకు ఏడీగా పనిచేసిన బి.గణపతిరావు తూర్పుగోదావరి జిల్లా మండపేటలోని రాష్ట్ర పశువైద్యుల శిక్షణ కేంద్రం ఉపసంచాలకులుగా పదోన్నతిపై బదిలీపై వెళ్లారు. ఈ మేరకు సీతానగరం ఏడీకి ఇన్‌చార్జ్ బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. పాడి రైతులకు అందుబాటులో వుండి పూర్తి స్థాయిలో వైద్య సేవలను అందించేందుకు తన వంతు కృషి చేస్తానని బాధ్యతలను స్వీకరించిన ఇన్‌చార్జ్ ఏడీ బుధవారం తెలిపారు.

పనులు ప్రారంభించండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

- మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో మంజూరైన రూ.13 కోట్ల నిధులతో రహదారి పనులు ప్రారంభించాలని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి కోరారు. బుధవారం సీతంపేట వచ్చిన ఆమె వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులతో కాసేపు సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మించాలనే ఉద్దేశంతో నిధులు మంజూరు చేస్తే ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. దీంతో అత్యవసర సమాయాల్లో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఆస్పత్రులకు రోగులను తరలించాలన్నా, అటవీ ఉత్పత్తులు మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయించాలన్నా ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్.లక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎస్.లక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత ఉపాధి శిక్షణకు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: విజయనగరం జిల్లా రాజాంలోని జీఎంఆర్ నగర్‌లో గల నాగావళి ఉచిత స్వయం ఉపాధి శిక్షణా సంస్థ(నైరెడ్)లో నిర్వహించే ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఆశక్తి ఉన్న అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఎం.రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురుషులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, జెంట్స్ టైలరింగ్, కంప్యూటర్ టాలీ అండ్ బేసిక్స్, మహిళలకు లేడీస్ టైలరింగ్, హోం నర్సింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, మగ్గంలలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27న నైరెడ్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, శిక్షణ సమయంలో ఉచిత శిక్షణ, భోజన, వసతి, యూనిఫాం,టూల్ కిట్లు సదుపాయాలు కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 90147 16255 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

కోటదుర్గ ఆలయ ఈఓగా సూర్యనారాయణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈఓ సూర్యనారాయణ

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దేవస్థానం కార్యనిర్వాహణాధికారిగా వీవీ.సూర్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శంబర పోలమ్మ ఆలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఈఓ మురళీకృష్ణకు అనకాపల్లి బదిలీ జరిగింది. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణకు దేవస్థానం సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ఇంటర్మీడియట్ ఎంతో కీలకం..

- డీవీఈఓ మంజులవీణ



మాట్లాడుతున్న డీవీఈఓ మంజులవీణ

పాలకొండ: ప్రతి విద్యార్థికీ ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమని డీవీఈఓ మంజులవీణ అన్నారు. బుధవారం స్థానిక బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల నడవడికలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. అలాగే విద్యార్థులు సక్రమంగా కళాశాలకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత కూడా తల్లిదండ్రులపైనే ఉందని చెప్పారు. ఇంటర్మీడియట్ దశలో బాగా చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ హరగోపాల్, అధ్యాపకులు పైల శంకరావు, వెలమల అప్పారావు, గోవిందరావు, వెంకటేశ్వరరావు, వెంకటరమణ, చంద్రరావు, విజయరాజు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

నియోజకవర్గంలోని పలు మండలాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయినా రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ అధ్వానంగా మారడంతో పాటు గుంతల్లో నీరు చేరింది. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– భామిని/పాలకొండ రూరల్



పాలకొండ రూరల్: తుమరాడ వద్ద రహదారి దుస్థితి (ఇన్‌సెట్లో) భామిని: చెరువును తలపిస్తున్న గురండి - నేరడి రోడ్డు

వ్యవసాయంలో సాంకేతికత..



డ్రోన్‌ను సిద్ధం చేస్తున్న రైతు రామచంద్రరావు

పాలకొండ రూరల్: వ్యవసాయానికి సాంకేతికత మేళవిస్తున్నారు మండల రైతులు. ఎరువుల వినియోగానికి డ్రోన్లు వినియోగిస్తున్నారు. లుంబూరు గ్రామానికి చెందిన రైతు పడాల రామచంద్రరావు బుధవారం డ్రోన్ సహాయంతో ఎరువు వేశాడు. ఎకరా పొలానికి ఎరువు వేసేందుకు డ్రోన్‌కు రూ. 300 చెల్లిస్తున్నారు. అదే కూలీలతో ఎరువులు వేయాలంటే మూడు రెట్లు ఎక్కువ ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు.